# మళ్లీ గెలిచేది బీఆర్ఎస్

- ముచ్చటగా మూడోసారి అధికారంలోకి..
- హ్యాట్రిక్ సీఎంగా కానున్న కేసీఆర్..
- దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ..
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత
- కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు విశ్వసించడంలేదు..
- మెదక్, మల్కాజిగిరిలలో మైనంపల్లి ఓడిపోవడం ఖాయం
- మల్కాజిగిరి ఆత్మీయ సమ్మేళన సభలో ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు
- మైనంపల్లి : మంత్రి మల్లారెడ్డి


మల్కాజిగిరి ఆత్మీయ సమ్మేళన సభలో ప్రసంగిస్తున్న మంత్రి హరీష్‌రావు, చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు

నేరేడ్‌మెట్, నవంబర్ 2: కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు చెప్పినా...బీఆర్ఎస్ ప్రభుత్వంపై గ్లోబల్ ప్రచారం చేసినా...మరో 28 రోజుల్లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో మంచే గెలుస్తుందని...చివరికి ధర్మమే నిలబడుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలో రాబోతుందని..హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి అభిప్రాయపడ్డారు. గురువారం మల్కాజిగిరిలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న విమర్శలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్‌లో గొడవలు, మతకలహాలతో ఎంతోమంది ప్రజలను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటి పెద్దగా రాష్ట్రాన్ని, ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ, తాగునీటి, కరెంట్ కష్టాలు తీర్చారని స్పష్టం చేశారు. దొరల తెలంగాణ అని కాంగ్రెస్ నేత విమర్శించడాన్ని హరీష్‌రావు తీవ్రంగా దుయ్యబట్టారు. కేసీఆర్‌లో దొరతనం..దొంగతనం లాంటి గుణాలు లేవని..ఆయనలో ప్రేమ...దయా గుణంతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని అన్నారు. తలసరి అదాయం, ధాన్యం ఉత్పత్తి, ఐటీ ఉద్యోగాల కల్పన, ఇలా ప్రతి రంగంలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని అన్నారు. రాష్ట్రంలో కరువు.. హైదరాబాద్‌లో కర్ఫ్యూ పరిస్థితులు తలెత్తకుండా శాంతిభద్రతల పరిరక్షణకు సీఎం అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ 75-80సీట్లలో విజయం సాధిస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. కాంగ్రెస్,బీజేపీలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు.

## అధికారంలోకి రాగానే పింఛన్లు పెంపు

తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా మార్చిన కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే రూ.2వేల ఆసరా పింఛన్‌ను రూ.5వేలకు పెంచడం తోపాటు మహిళల కోసం సౌభాగ్య లక్ష్మి పేరుతో కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ పథకం ద్వారా ఆడపడుచుల బ్యాంక్ ఖాతాల్లో నెలకు 3వేలు జమ అవుతాయని తెలిపారు. వచ్చే జనవరి నుంచి రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కోటి మందికి రూ.5లక్షలకు కేసీఆర్ జీవిత బీమా పథకం అమలు చేయనున్నట్లు చెప్పారు. గ్యాస్ సిలిండర్ ధరను బీజేపీ రూ.1000లకు పెంచి తే.. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400లకే అందించాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ లాంటి దోపిడి దొంగలకు కాకుండా సంపద పెంచాలి... పేదలకు పంచాలి అనే నినాదంతో ముందుకుసాగుతున్న కేసీఆర్‌సర్కారుకు మరోసారి అండగా నిలబడాలని కోరారు.

## ‘మల్కాజిగిరి’ని పట్టించుకోని రేవంత్‌రెడ్డి

ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి నాలుగేండ్లుగా మల్కాజిగిరిని పట్టించుకున్న పాపాన పోలేదని మంత్రి విమర్శించారు. ఈఎన్నిక ల్లో కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. నిన్నామొన్నటి వరకు కేసీఆర్ గొప్ప అని మట్లాడిన మైనంపల్లి హన్మంతరావు తన కొడుకు టికెట్ ఇవ్వకపోయేసరికి..స్వార్థం కోసం కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. ఏదైన అతిగా చేస్తే ‘ఉన్నది పాయె..’ చందంగా ఈ ఎన్నికల్లో మెదక్‌తోపాటు మల్కాజిగిరిలో మైనంపల్లి ఓడిపోవడం ఖాయమని మంత్రి వ్యాఖ్యానించారు.

## నేతలను భయబ్రాంతులకు గురిచేశారు..

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఒక మచ్చర్ ఫయిల్‌వన్...నడవడానికి ఆయనకు ముగ్గురు తోడు కావాలని మంత్రి మల్లారెడ్డి వ్యంగ్యంగా విమర్శించారు. ఇక్కడి కార్యకర్తలు, నాయకులను భయపెట్టి, భయబ్రాంతులకు గురి చేశారన్నారు. మైనంపల్లికి దమ్ము లేదని, మైనం‘పిల్లి’గా మల్లారెడ్డి అభివర్ణించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర రెడ్డి, ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గెలిపించండి.. సమస్యలు పరిష్కరిస్తా

### మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి


మల్కాజిగిరి సర్కిల్‌లో ప్రచారం చేస్తున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 2: మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మల్కాజిగిరి , అల్వాల్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, గౌతం నగర్, నేరేడ్‌మెట్, వెంకటాపురం డివిజన్‌లలో అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి పాదయాత్రచేసి ఇంటింటికి ప్రచారం నిర్వహించి.. సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ఓటర్లు పట్టం కట్టారని, రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి మంచి స్పందన ఉందని అన్నారు. మల్కాజిగిరిని రైల్వే చక్రబంధం నుంచి విముక్తి కల్పిస్తామని అన్నారు. వాజ్‌పేయినగర్‌లోని రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మించడానికి గత నాలుగు సంవత్సరాల కిందట శంకుస్థాపన జరిగిందని.. ఇప్పుడు న్న ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో రోజు వాహనదారులు నరకాన్ని చివిచూస్తున్నారని అన్నారు. ఎన్నికల తర్వాత వాజ్‌పేయినగర్, గౌతంనగర్, కాకతీయనగర్, బొల్లారంలలోని రైల్వే గేట్ల సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తున్నామని అన్నారు. ఇప్పటికే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నెల నెలా పెన్షన్‌లు అందజేస్తున్నామని అన్నారు. విడతలవారీగా పెన్షన్‌లు పెంచుతామని అన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకంలో మహిళలకు నెల నెలా రూ.3వేలు అందజేస్తామని అన్నారు. కల్యాణ లక్ష్మి-షాదీముబారక్ పథకంలో ఎన్నికల తర్వాత రూ.2,00,116 పెంచుతామని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, కార్పొరేటర్లు సునీతారాము యాదవ్, మీనాఉపేందర్ రెడ్డి, సబితాకిశోర్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, రాముయాదవ్, ఉపేందర్ రెడ్డి, గౌలికర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో గజమాలతో మంత్రి హరీష్‌రావు, అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిలను సన్మానిస్తున్న నేతలు


ఆత్మీయ సమావేశానికి తరలివస్తున్న గులాబీ దండు..


మల్కాజిగిరి డివిజన్ నాయకులతో సభకు వస్తున్న మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన జనాలు.. భారీగా తరలివస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

## మల్కాజిగిరి.. గులాబీ మయం

### భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు , ప్రజలు

మల్కాజిగిరి, నవంబర్ 2: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్.. బీఆర్ఎస్ పార్టీ జిందాబాద్.. మంత్రులు హరీష్ రావు, మల్లారెడ్డి , మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిలు జిందాబాద్.. అంటూ నాయకుల నినాదాలతో మల్కాజిగిరి దద్దరిల్లింది. గురువారం మల్కాజిగిరిలోని లక్ష్మీసాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు హరీష్‌రావు, మల్లారెడ్డిలు హాజరైనారు. మల్కాజిగిరి, మౌలాలి, వెంకటాపురం, అల్వాల్, నేరేడ్‌మెట్, వినాయక్‌నగర్, మచ్చబొల్లారం, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరైనారు. మ ల్కాజిగిరి ఎటుచూసినా గులాబీమయంగా మారింది. పార్టీ నాయకులు, కార్యకర్తల నినాదాలు, చప్పట్లతో హోరెత్తింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేను మేమే తీసుకువచ్చి గెలిపించామని, అయితే ఆయనకు టికెట్ ఇచ్చినా కొడుకు టికెట్ కోసం పార్టీని మో సం చేశాడని, ఆలాంటి వ్యక్తిని ఈ ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. మ ల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే..ఈ దగాకోరు ఎమ్మెల్యే మైనంపల్లిని సాగనంపాలని సభ వేదికపై నుంచి మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిని గెలిపించడానికి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.